# ధన ప్రాప్తి

రచన:
"స్వాతి"

కమలమ్మకు చాలాసంతోషంగావుంది. ఆమె సంతోషంగా ఉండడానికి కూడ కారణం లేక పోలేదు. నిన్నంతా ఆమె కుడిభుజం అదిరింది. అందుకే ఆమె అంత సంతోషంగావుంది.

కుడిభుజం అదిరితే సంతోషం పడాల్సింది ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నారుకదూ!.

ఒకసారి యేమైందంటే కుడిభుజం అదిరిన వారం రోజుల తర్వాత కమలమ్మ సినిమానుండి యింటికి కొచ్చేటపుడు ఒక పర్సు దొరికింది. దానిలో వేయి రూపాయల వరకు డబ్బుంది.

ఇంకొకసారి కుడిబుజం అదిరిన యిరవై రోజుల తర్వాత ఆమె కొన్నలాటరీ టికెట్టుకు వేయి రూపాయల ప్రైజువచ్చింది. ఇలా ఇంకా రెండు సంఘటనలు జరిగాయి. అప్పటినుంచి కుడిబుజం అదిరిందంటే చాలు డబ్బు వస్తుందని కమలమ్మకు ఆశ.

కమలమ్మ భర్త బ్యాంకులో క్యాషియర్. ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. ఇద్దరాడ పిల్లలకి ఒక అబ్బాయికి పెళ్ళి కూడ అయ్యింది. ఇంకో కొడుకు ఇంటర్ మీడియట్ చదువు చున్నాడు. ఇది ఆమె సంసారం.

భర్త బ్యాంకుకు పోయేటప్పుడు రెండు లాటరి టికెట్లు తీసుకు రమ్మంది.

అతను అలాగే తీసికొచ్చాడు.

* * *

వారం రోజులు గడిచి పోయాయి.

ఆరోజే లాటరీ టికెట్లుడ్రా. రేడియోలో మొదటి, ద్వితీయ,తృతీయ బహుమతుల నంబర్లు చెప్పారు. పాపం కమలమ్మ వినలేదు. తను వినలేక పోయినందుకు చాల బాధ పడింది. తనకు మొదటి బహుమతి వచ్చిందే కావొచ్చు అని అనుకుంది.

తెల్లవారింది, పేపర్లో తన లాటరీ టికెట్ల నంబరు వచ్చిందేమోనని కొడుకుతో చూపించింది.

'మనకు యే ప్రైజూ రాలేదు అమ్మా' అన్నాడు కమలమ్మ కొడుకు.

'నీకు చూడరాదురా' అంటూ పేపరు,లాటరీ టికెట్లుతీసికొని భర్తదగ్గరకెళ్ళి చూడమంది.

'మనకు ఏ ప్రైజురాలేదు' అన్నాడు ఆమె భర్త కూడ.

వూరికే రెండు రూపాయలు పాడై పోయాయి అంటూ బాదపడింది. కాని తనకు యెలాగైనా డబ్బు సంక్రమిస్తుందన్న ఆశ ఆమెకుంది.

* * *

నెల పదిహేను రోజుల తర్వాత కమలమ్మ అనుకున్నట్లుగానె ఆమెకు చాలడబ్బు వచ్చింది.

ఎలావచ్చింది అని మీకు అనుమాన మొస్తుంది కదూ? నెలరోజులక్రితం ఆమెభర్త మోటరు ఆక్సిడెంట్లో చనిపోయాడు. ఆ వచ్చిన డబ్బు ఆమె భర్త "జీవిత భీమా" డబ్బు.

